# లేడీ కరుణాకరం

పండుగకి కరుణాకరం అత్తవారి ఊరు వెళ్ళేడు. కూలివాడి నెత్తి మీద పెట్టెనుంచి అత్తవారి వీధిలో కొచ్చాడు. అతనిముందు నడుస్తున్న కొక్కిరాయి కుర్రాళ్ళు అతని అత్తారింటిని చూస్తూ ముదరమాటలు మొద లెట్టేరు.

"మేష్టరు అరుగులకి సిమ్మెంటు చేయిస్తున్నాడురోయ్!"

"వాడికేం? తురుఫాసులాంటి కూతురుంది. అది కాపరానికెళ్ళే లోపల బంగారపు గోడలు పెట్టిస్తాడు."

"ఈ రోజుల్లో నలుగురు కూతుళ్ళని కనుక్కొన్న వాడిదదృష్టం"

"జగదోద్ధారణా...."

కరుణాకరం మొహమెఱ్ఱబడ్డాది. తనని చూసి, తన మామమీద, పెళ్ళాంమీద కారుకూతలు ప్రారంభించారు కాబోలు. వాళ్ళతో నోరుచేసు కొని ప్రయోజనంలేదు. లేక వాళ్ళ మాటల్లో కించిత్ సత్యముందేమో! అనుమానానికి హేతువైంది.

కూలివాడు వీధరుగుమీద పెట్టి దించబోతున్నాడు.

"ఆఁ. అక్కడ దించకు కొత్త గచ్చు" అంటూ కిటికీలోంచి చూసి తలుపు తీసింది అత్తగారు.

"రా నాయనా రా. కాకి కావుకావుకావుమంటే ఇవాళ వస్తావనే అను కొంటున్నాము. సావిట్లో కూర్చో. మామగారు వచ్చే వేళైంది" అని అల్లుడ్ని పలకరించి ఇంట్లోకెళ్ళి "ఏమర్రోయ్ పిల్లలూ బావ వచ్చేడు" అని పెరట్లో ఆడుకొంటున్న పిల్లల్ని కేకేసింది.

మరుదులు, మరదళ్ళు సొలగకిసొలగా "ఏం బావా?" అంటూ వొచ్చి పడ్డారు. వాళ్ళకి బావ రావడము పండుగ. హాస్యాలకి,సంతోషాలకి, కొత్త రకం ప్రేమకి బావ ఆదరవు.

అత్తగారు లొడలొడ ప్రశ్నలువేసి "వస్తాను మళ్ళా అన్నం చిమిడి పోతుంది" అని లోపలకెళ్ళి, తిరిగి సావిట్లోకి వచ్చి అల్లుడుతో ముచ్చటిస్తూ చంటిపిల్లల కళ్ళకలక, తనికి నడుంపీకు, ఈమధ్య పడ్డ వడగళ్ళ వాన' దూడలపాక కూలిపోవడం, అతని పెళ్ళాం పూతికపుల్లయినా ఇంట్లో చెయ్యకపోవడం మొదలైన భోగట్టాలన్నీ అల్లుడితో చెప్పడము, వంట పూర్తి చేయటమూ ఒక్కసారి చేసింది.

కరుణాకరానికి భార్యా సందర్శనం కలుగలేదు. కాని పెరటి వరండాలోంచి గాజులు గల్లుగల్లు వినబడుతూ వుండడాన్ని అతని వొళ్ళు గగుర్పొడుస్తూవచ్చింది. ఇంతలో "సుందరీ" అనే కేక పెరట్లోనుంచి వినవచ్చింది అది అతని పెళ్ళాంగొంతుకే. పెద్దమరదలు సుందరి పెరట్లో కెళ్ళి కప్పుతో కాఫీ తెచ్చి బావకిచ్చింది.

మామగారొచ్చారు. అల్లుణ్ణి ఎంతో అభిమానంతో చేరదీసుకున్నాడు. కరుణాకరం చెన్నపట్నంలో ఎఫ్ఫే చదువుతున్నాడు. మామగారు నెల నెలా ముప్పయిరూపాయిలు పంపుతున్నాడు.

మరుదులు, మరదళ్ళ అభిమానం, మామగారి మంచి, అత్తగారి అవస్థ, పెళ్ళాం కాచిపంపిన కాఫీ పెళ్ళాంమీద కలిగిన అనుమానానికి అవకాశ మిచ్చాయి కావు.

రాత్రి భోజనం కాగానే బడలికచేత పడుకున్నాడు. కాని నిద్ర తిన్నగా పట్టలేదు. పక్కింటివాళ్ళ గడియారం అరగంట కొట్టింది. పదకొండున్నరో, పన్నెండున్నరో. వీధి తలుపు తట్టినట్టయింది.

"ఇవాళ వద్దని కబురు పంపలేదూ?" అని మామగారు పెళ్ళాంతో మెల్లగా అన్నాడు.

"వెళ్ళేవాళ్ళు లేకపోయారు" అని అత్తగారు చెప్పింది.

మెల్లిగా వూపిరితో చెప్పుకొన్నా - కీచురాళ్ళ అరుపులోంచి స్పష్టంగా కరుణాకరం విన్నాడు. మామగారు వీధి తలుపు తీశాడు. కరుణాకరం తలుపు కన్నంలో కళ్ళు పెట్టి చూశాడు.

అత్తగారు మంచంమీద కూచునుంది. పెళ్ళాం కళ్ళు నులుముకుంటూ పక్కగదిలో కెళ్ళుతున్నది. దానివెనకే సరసుడు వెళ్ళుతున్నాడు.

సరసుడు సరసుడులాగే వున్నాడు. వాడైనా కరుణాకరం ఎరుగనివాడు కాడు. పక్క వీధినున్న నాయుడు.

కరుణాకరం వీరావేశంతో తలుపు తియ్యబోయాడు. తలుపు అవతల గొళ్ళెం పెట్టి ఉంది. తలుపు చితక తన్నాడు. ఆఖరికి మామగారు తలుపు తీశాడు. పెళ్ళాం పక్కలో పడుకుని నిద్ర నటిస్తున్నది.

"నీ పెద్ద మరదలు గొళ్ళెం పెట్టింది. వెధవ హాస్యాలూ ఇదీనీ" అన్నాది అత్తగారు.

"ఔను నే నెరుగుదును. ఏడీ ఆ వెధవ?" అన్నాడు కరుణాకరం.

"ఎవడు?"

"నాయుడు లక్ష్మీ కొడుకు"

అత్తమామలు నిర్ఘాంతపోయారు.

"ఇక్కడెవరూ లేరే. కలొచ్చింది కాబోలు" అన్నాది అత్తగారు.

"చాలా దూరం వెళ్ళివుంటాడు. సరే" అన్నాడు. ఖూనీలు చేద్దామని తలుపుకొట్టేడు. ఇవతలికి రాగానే కూలిపోయాడు. వాళ్ళనేమి చెయ్యడానికి తోచక గదిలో పెట్టి తీసి బయలుదేరాడు.

"ఎక్కడికి నాయనా ప్రయాణం?" అంది అత్తగారు.

"మీ కూతుర్ని నాకు పెళ్ళిచేశారు. నాయుడుతో పునస్సంధానం చేశారు. ఇహ చౌదరితో కాపరానికి పంపండి" అని వెళ్ళిపోతున్నాడు.

మామగారు అడ్డుపడ్డారు.

"మా మాట విని తరువాత అను. నిజమే. తప్పుపనే చేశాము. నిన్ను మభ్యపెట్టినా నీ యోగక్షేమమాలోచించే చేశాము. నీచదువుకి డబ్బు పంపుతున్నాను. పిల్లలవాణ్ణి ఎక్కణ్ణుంచి తేగలను. నువ్వు చదువుకుని పెద్దవాడివయి మా అందరికీ ఆదరువు అవుతావనే చేశాము. పిల్ల అమాయకురాలు. దానిగొంతుకొయ్యకు. మమ్మల్ని ఎంతైనా అను. పడతాము" అని నడ్డిపట్టుకున్నాడు.

కత్తీ వెధవల్లారా, ఈయేడు సిమ్మెంటుగచ్చు చేయించారు. వచ్చే యేడు రెండంతస్తులమేడ కట్టించుకోండి. వదులు" అని మామని దుళ్ళగొట్టేసేడు.

"నాకొంప కూల్చేశా ర్రోయ్... నా కుపకారమన్నార్రోయ్.... నాచేత్తో నాపీక కోసేశార్రోయ్" అంటూ శారద శోకాలు తీస్తూవచ్చి కరుణాకరం కాళ్ళమీద పడ్డాది. ఏడుస్తూ శారద నిర్దోషిలా కనపడ్డాది. తుమ్మెదల లాంటి దాని కళ్ళు నీళ్ళతో నిండి ఏడుస్తూ ఉంటే తట్టుకోలేకపోయాడు.

"సరేపదా. ఇక్కణ్ణుంచి నిన్ను తీసుకుపోతాను" అన్నాడు.

"పదండి" అన్నది.

దానిరెక్క పట్టుకుని వీధిలోకి తీసుకెళ్ళాడు.

"తెల్లారితే పండగ. నలుగుర్లో పడిపోతాము. రేపుండి అలాగే వెళ్ళండి" అన్నాది అత్తగారు.

"నలుగుర్లో కాదు. నలభైమందిలో పడండి" అని పెళ్ళాన్ని తీసుకు పోయాడు. మామ కిక్కురు మనలేదు. శారద కట్టుగుడ్డతో మొగుడివెంట వెళ్ళిపోయింది.

చదువు మానేసి కరుణాకరం చెన్నపట్నంలో గుమస్తాగా కుదురుకున్నాడు. రవ్వారొస్టూ లేకుండా ఎంతో హాయిగా, సుఖంగా కాపరం చేస్తున్నాడు. ఆరేడుమాసాలైంది. కరుణాకరానికి ఒకనాడు వాళ్ళవీధిలోంచి పోతూ నాయుడు కనపడ్డాడు. అనుమానం కలిగింది. మర్నాడు ఆఫీసు కెళ్ళక తప్పిందికాదు. కాని మూడు గంటలకి తెంపిచేసికొని వీధిలోకెళ్ళి మాటు వేశాడు. వాళ్ళింట్లోంచి నాలుగుగంటలకల్లా నాయుడు వెళ్ళిపోతున్నాడు. గుండె లటుక్కుమంది. ఇంట్లో కెళ్ళాడు. పెళ్ళాం మంచంమీద కళ్ళు మూసుకుని పరిమళిస్తూ పడుకున్నాది. దాని గుండెల మీంచి కిందికి వేళ్ళాడుతూ పడివుంది మూడుమూళ్ళజడ. ఏ పురుషుణ్ణయినా ఉరిపొయ్యడానికది చాలు.

కరుణాకరం చడికావడంతోనే కళ్ళు విప్పింది. చెంపకి చేరదేసి కళ్ళు. నిండుగా మొగుణ్ణి చూచి చటాలున లేచి మొగుడిమీద వాలిపోయింది.

"సానిపాపవి. ఎన్ని లజ్జులైనా చేస్తావు. దూరంగా పో దగుల్బాజీ ముండా" అని దాన్ని విదిలించుకొన్నాడు.

"ఎందుకలా మండిపడతారు?" అంది.

"మళ్ళా ఈ వ్యవహారం ఎన్నాళ్ళాయి?"

"ఏ వ్యవహారం?"

"గుడిసేటుదానా, నాయుడు రావడంలేదూ?"

"మీరు చూశారా?"

"చూశానుగనకే"

"చూడ్డం మీది తప్పు"

"నువ్వు తిరగడం తప్పా. నేను చూడ్డం తప్పా? అమ్మ!"

"ఇహ నోరు తిన్నగా రానీ, రోజూ వస్తున్నాడు, నాకోసం మెడ్రాసు నావెనకే వచ్చాడు. సందేహం తీరిపోయిందీ? ఇంతకీ మీకేం ద్రోహం చేశాను?"

"మరెవరికీ ద్రోహం ?"

"నాయుడు డబ్బుపెట్టి చదువుకొన్నావు. అందుకే ఈ వెధవ ఉద్యోగమైనా చేస్తున్నావు. అతనన్నమే తిని అతని బట్టే కడుతున్నావు. నేనేంద్రోహం నీకు చేశాను. వాణ్ణిదోచి నీకు పెడుతున్నాను. పుస్తె ముడి వేసిన మొగుడివికదా అని! నాకే ద్రోహబుద్ధి ఉంటే వాడితో లేచిపోనూ? నన్ను కనకపు సింహాసనం మీద కూర్చోపెడతాడే!

పేరూ ప్రతిష్ఠాలేకుండా వెధవవుద్యోగం చేస్తున్నావు. నీకుచెపుదామనే అనుకొన్నాను. నువ్వే వెర్రిపడ్డావు" అని ఉపన్యాసమిచ్చి లోపల కెళ్ళి తన చందుగుపెట్టి తీసికొచ్చి, పుస్తెల్లో తాళంతో తీసి, సొరుగు అర తీసి చూపించింది.

అందులో ఉన్నాయి విరజిమ్మి లెక్క తెలియనన్ని పది రూపాయల నోట్లు, కట్టలకి కట్టలు. చందుగు తలుపుమీది అద్దంలో ప్రతిబింబిస్తూ రెండు రెట్లుగా కనబడుతున్నాయి.

"వచ్చినప్పుడల్లా రెండేసి మూడేసి నోట్లు ఇస్తున్నాడు. కక్కుర్తి పడ్డా కడుపు నిండుతున్నాది. చెడ్డదాన్ని ఇదివరకే చెడ్డాను. అప్పుడు పనికొచ్చినదాన్ని ఇప్పుడూ పనికొస్తాను" అన్నాది.

"నీ మొహం చూడకూడదు. వెళ్ళు అవతలకి" అన్నాడు.

"ఓహో మహాజోరుగా ఉందే! నువ్వే వెళ్ళు అవతలకి. ఏమిటో అనుకుంటున్నావు. నావల్ల నువ్వీపాటి వాడివైనా అయావు. నువ్వే ఇంట్లోంచి నడువు. నువ్వేం నాకు పెట్టి పోషించనక్కరలేదు" అన్నాది.

ఆ మాటలతో అతనికి చలి జ్వరంలాగా కుదుపు పట్టుకుంది. ఏమిటి చెయ్యడం? అది చెప్పినట్టు ఒొప్పుకోవడమా లేక సిద్ధాన్నాన్ని, అందమైన పెళ్ళాన్ని వదిలి వెళ్ళిపోవడమా?

"జరిగింది జరిగింది. ఇకనైనా తిన్నగా ఉంటావా ?"

"పిచ్చి పిచ్చి పిచ్చి" అతని బుగ్గను పట్టుకుని సాగతీసింది.

"చాలు శృంగార చేష్టలు. ఇవి చూసే మోసపోయాను."

"ఏం కొంప మునిగిపోయింది. వెధవచేదస్తాలు పెట్టుకోకండి. అంత డబ్బు పెట్టుతున్నవాణ్ణి ఎలాగ ఒొమ్మంటావు? ఈ చేస్తున్న వెధవ ఉద్యోగం మానీయండి. ఎంతవరకు చదవాలంటే అంతవరకూ చదవండి. అప్పుడు మనకు లోటు ఉండదు" అని సలహానిచ్చి చందుగులో నోట్లు చేతితో చేతిడి పిసికి పట్టుకుని "ఇందండి" అన్నాది.

అతనికేం పాలుపోలేదు. జన్మలో నాలుగు పదిరూపాయల నోట్లు ఒక్కసారి పట్టుకొని ఎరగడు. నోట్లు కట్లు మణిగిపోతూ చందుగునిండా ఉన్నాయి. అతని కళ్ళమ్మడి నీళ్ళుకారాయి. అప్రయత్నంగా అతని కేడు ఒొచ్చింది.

"ఛా ఏమిటండీ అదీ? డబ్బులేనివాళ్ళు గవ్వకి మారుతారా? ఇందండి ఈ డబ్బంతా మీదే. డబ్బేనా? నేనూ మీదాన్నే. కోపం పోయిందా? కాలేజీలో చేరండి. ఉద్యోగం మానేయండి" అని సముదాయించింది, సమాధానపరిచింది.

కరుణాకరం తెలివైనవాడు. లేనిపోని గొడవలకి పోక చెవికి తాడు కట్టుకుని చదవడం ప్రారంభించాడు. విశ్వవిద్యాలయానికి మొదటితరగతి వాళ్ళలో మొదటివాడుగా ఎమ్మేలో ఉత్తీర్ణుడయ్యాడు. ఆర్థికశాస్త్రం అతని ప్రత్యేక కృషి. పేసవగానే బేంకిలో ఉన్నతోద్యోగము వచ్చింది.

శారద పిల్లలతల్లి అవుతూ చెన్నపట్నం మీదికి విజృంభించింది. దానిది శ్రీకృష్ణదేవరాయల వారి విజయయాత్ర. రవ్వల ఆభరణాలు, చీని చీనాంబరాలు, పళ్ళరసాలు, మత్తుపానీయాలు, పట్టుపాన్పులు అనుభవానికి వచ్చాయి.

కనకాభిషేకం చేస్తూ, ఆమె తనులతాసౌష్టవాన్ని సహస్రనామా ర్చనచేస్తూ విటకోటి సీమకుక్కల్లాగ చేరవచ్చారు.

కరుణాకరం బుద్ధికుశాగ్రమైనది. కొద్దికాలానికే విదేశీబేంకిలో ఇంకా ఉన్నతోద్యోగి అయిపోయాడు. శారద సంతోషానికి మేరలేదు. మొగుణ్ణి తీసుకువెళ్ళి పోర్డుకారు కొని బహూమానం చేసింది. ఇంకేంకావాలి కరుణాకరానికి?

బడిపిల్లల పోటీల్లో శారద అధ్యక్షత వహించి పిల్లకాయలకి పుస్తకాలు పంచిపెట్టింది. మిసెస్ కరుణాకరం అని ఆమె ఫొటో పేపర్లలో అచ్చుపడ్డాది. ఇంకేం కావాలి?

పిల్లలంతా కరుణాకరం మీదికి 'నాన్నా నాన్నా' అంటూ ఎగబాకుతారు. వాళ్ళందరికీ తనెక్కడి నాన్న? పెద్దవాడు నాయుడు కొడుకు, రెండో ఆడపిల్ల లాయరు పోలిక, తరవాత జయంతుడు శారద ప్రతిబింబం.

ఆరుగురు పిల్లలని పరాయి దేవతలకికన్న కుంతీదేవి పతివ్రతే అన్నారు. భర్త అనుమతి ఇస్తే తప్పులేదన్నారు ధర్మశాస్త్రజ్ఞులు. ఎవడి అనుమతిలేకుండా "టెస్టుకేసు" కింద కర్ణుణ్ణి కని దరిదాపు భ్రూణహత్యే చెయ్యబోయింది కుంతికన్య ! కుంతి పతివ్రతైతే శారదా పతివ్రతే. ధర్మజాదులని "పాండవుల"న్నారు. వాళ్ళు పాండునందనులైతే వీళ్ళు కరుణాకర సంతానమే!

పిల్లలు లేనివాళ్ళు పరాయిపిల్లలని తెచ్చి పెంచుకుంటారు. కరుణాకరం సమాధానపడ్డాడు. అనేక విషయాలలో సమాధానాలు పడుతూ వుంటేనే జీవితం ఎవరికైనా గడుస్తుంది. పెళ్ళాం కనిపెట్టిన పిల్లలను కరుణాకరం పెంచుకుంటూ తన వాళ్ళని చేసుకొన్నాడు.

ఆఫీసు నుంచి పోర్డుకారులో ఇంటికిరాగానే పిల్లలు మీదికొచ్చారు. కరుణాకరం పెళ్ళాం దగ్గరికి వెళ్ళాడు.

"నీవల్ల ఇంతవాణ్ణయాను. నువ్వు శారదవి. విద్యాదానం చేశావు. శారద వెయ్యిమందిని వరిస్తుంది. దానికి దోషంలేదు. అడ్డుపెట్టినా బ్రహ్మదేముడికి చెల్లదు" అని భార్యాస్తవం ప్రారంభించాడు.

"ఏమిటి సంగతి?" అన్నది శారద.

"నీకు తీరిక వుందా?"

"ఎందుకూ ?"

"నీ విలాసాలన్నీ అయిన తరవాతవాణ్ణి. చిన్నవిషయం" అని చేతి కందిచ్చాడు కవరు.

అతనికి ప్రయివేటుగా ఇంటిమేషను వచ్చింది. సాయంకాలం పేప రులో ఎలాగా వచ్చేస్తుంది. మర్నాటికి దేశమన్నిమూలలా వార్త పాకి పోతుంది. శారద చదివి ఉద్రేకం పట్టలేకపోయింది.

"సర్ బిరుదమే! నైట్ హుడ్డే! ఇన్నాళ్ళకి జన్మ సాఫల్యం అయింది. నేను నైటుగారి సతీమణిని. రేపట్నుంచి నేను గవర్నరు సతితో విందులకెళతాను. ఐయామ్ లేడీ కరుణాకరం ఏమంటావు?" అన్నాది.

"యస్ - మై - డార్లింగ్" అన్నాడు కరుణాకరం.

శారద మహాపతివ్రత !